క్లుప్తంగా

ఆలయంలో వైభవంగా నక్షత్ర నీరాజనం



నక్షత్ర నీరాజన పూజల్లో పాల్గొన్న భక్తులు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెంలోని శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి దేవాలయంలో జరుగుతున్న ధనుర్మాసోత్సవాల్లో భాగంగా బుధవారం నక్షత్ర నీరాజన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తులసి అర్చన, విష్ణు సహస్ర పారాయణం జరిపారు. మహిళలు మంగళహారతులతో తరలివచ్చి పూజలు జరిపి కుంకుమార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు అర్వపల్లి రాంబాబుఅయ్యంగార్, పవన్‌కుమార్, భక్తులు పాల్గొన్నారు.

బడి బయట పిల్లల గుర్తింపు సర్వే



ఇంటింటి సర్వే చేస్తున్న సీఆర్పీ రవీందర్

నూతనకల్ : మండలంలోని ఆయా గ్రామాల్లో బడి బయట పిల్లలను గుర్తించడం కోసం ఇంటింటి సర్వే నిర్వహించారు. బుధవారం బిక్కుమళ్లలో ఇంటింటికీ సర్వే చేసి బడి బయటి పిల్లలను గుర్తించి నమోదు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఆర్పీ కనకం రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ(ఎంఎల్)లో చేరిన బీఆర్‌ఎస్ కార్యకర్తలు



పార్టీలో చేరిన బీఆర్‌ఎస్ కార్యకర్తలు

నాగారం : మండలంలోని డి.కొత్తపల్లి గ్రామానికి చెందిన పలువురు బీఆర్‌ఎస్ కార్యకర్తలు బుధవారం సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో మద్రిపల్లి వెంకన్న, బయ్యం భాస్కర్, అనంతోజు సందీప్ తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు యానాల సుధాకర్‌రెడ్డి, ఏఐకేఎంఎస్ డివిజన్ అధ్యక్షుడు సంపెట కాశయ్య, బయ్యం లింగయ్య, సంపెట కృష్ణమూర్తి, సైదులు, కాసం వీరయ్య, లింగమల్లు, శ్రీను, రమేష్, వేముల గణేష్, సతీష్, నాతి బాలరాజు, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన ఎరువులను విక్రయించాలి



ఎరువుల దుకాణంలో తనిఖీ చేస్తున్న ఏఓ

తుంగతుర్తి : రైతులకు నాణ్యమైన ఎరువులను విక్రయించాలని ఏఓ బాలకృష్ణ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఫైస్టిసైడ్స్ దుకాణాలను ఆయన తనిఖీ చేసి మాట్లాడారు. ఎరువుల దుకాణాల్లో స్టాక్‌బోర్డు ఏర్పాటు చేసి, వివరాలను నమోదు చేయాలన్నారు. తప్పనిసరిగా రైతులకు రశీదు ఇవ్వాలన్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు.

బహుమతులు అందజేత



క్రీడాకారులకు బహుమతులు అందజేస్తున్న ఆదర్శయూత్ సభ్యులు

నాగారం : మండల పరిధిలోని పస్తాల గ్రామంలో క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని ఆదర్శ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు యూత్ సభ్యులు బుధవారం బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ.. క్రీడలతో స్నేహభావం పెంపొందుతుందని, క్రీడలు శారీరక, మానసిక ఉల్లాసానికి దోహదపడుతాయన్నారు. గ్రామీణ యువత క్రీడల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు కట్ట దయాకర్, మేడే విజయ్‌కుమార్, గుండగాని ఎల్లయ్యగౌడ్, మేడే జాన్, వీరస్వామి, కిషోర్, ఆదర్శయూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పదవీ కాలాన్ని పొడిగించాలి

తుంగతుర్తి : గ్రామాభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్న సర్పంచ్‌ల పదవీ కాలాన్ని పొడిగించాలని స్థానిక సర్పంచ్ యాకునాయక్ ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

‘ప్రజా పాలన’తోనే ఇందిరమ్మ రాజ్యం

● తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్



తిరుమలగిరి : సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మందుల సామేల్



సన్నాహక సమావేశానికి హాజరైన అధికారులు, ప్రజాప్రతినిధులు

తిరుమలగిరి (తుంగతుర్తి) : రాష్ట్ర ప్రభుత్వం నేటి (గురువారం) నుంచి ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ప్రజా పాలన కార్యక్రమంతో మళ్లీ ఇందిరమ్మ రాజ్యం వస్తుందని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. బుధవారం తిరుమలగిరి పట్టణంలో ప్రజా పాలనపై తుంగతుర్తి నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, అధికారులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధే లక్ష్యాలుగా కాంగ్రెస్ ప్రభుత్వ పాలన సాగుతుందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో గత 10సంవత్సరాలు నియంతృత్వ, రాచరిక పాలన సాగిందని, ఇక నుంచి ప్రజాపాలన ప్రారంభమవుతుందన్నారు. ప్రజాపాలన మొక్కుబడిగా ఉండదని, ప్రతిఒక్కరికీ ఆరు గ్యారంటీలు అందిస్తామన్నారు. ప్రజల నుంచి గ్రామ, వార్డు సభల ద్వారా దరఖాస్తులు స్వీకరించాలని అధికారులను కోరారు.

ప్రజలకు ఇబ్బందులు లేకుండాచూడాలి : అదనపు కలెక్టర్ ప్రియాంక

ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని జిల్లా అదనపు కలెక్టర్ ప్రియాంక అన్నారు. జిల్లాలో ప్రతి గ్రామంలో ఈ గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అధికారులు లబ్ధిదారుల నుంచి ప్రతి దరఖాస్తు తీసుకోవాలని సూచించారు. అదే విధంగా దరఖాస్తు ఏవిధంగా చేసుకున్నారో సరి చూడాలన్నారు. ప్రతి దరఖాస్తు తీసుకొని అందులో నంబర్ ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి రామారావు నాయక్, జిల్లా హార్టికల్చర్ అధికారి శ్రీధర్, ఎంపీపీ స్నేహలత, జెడ్పీటీసీ దూపటి అంజలి, తహసీల్దార్ రమణారెడ్డి, మున్సిపల్ కమిషనర్ దండు శ్రీనివాస్, ఎంపీడీఓ ఉమేష్‌చారి, భీంసింగ్, మండల పంచాయతీ అధికారి మారయ్య, అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

సూర్యాపేట రూరల్ : తెలంగాణ ప్రభుత్వం నేటి నుంచి గ్రామాల్లో నిర్వహించే ప్రజా పాలన గ్రామ సభల ఏర్పాట్లను బుధవారం అధికారులు పరిశీలించారు. మండల పరిధిలోని ఆరెగూడెం, సపావత్ తండా గ్రామ పంచాయతీల్లో ఏర్పాట్లను మండల ప్రత్యేక అధికారులు పరిశీలించారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఈఈ భద్రునాయక్, ఎంపీడీఓ శ్రీనివాస్‌రావు, మిషన్ భగీరథ ఏఈ భరత్‌కుమార్, కిరణ్మయి, గోపి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి గ్రామసభలు

మద్దిరాల : మండలంలోని ఆయా గ్రామాల్లో నేటి నుంచి ప్రజా పాలనపై గ్రామసభలు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ అమీన్‌సింగ్ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో విలేకరులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో 2బృందాలు గ్రామసభలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. నేడు రెడ్డిగూడెం, రామచంద్రపురం, కుంటపల్లి, చౌళ్లతండాలో, 29న గోరెంట్ల, పోలుమల్లలో, 30న జి.కొత్తపల్లి, మామిండ్లమడవ, తూర్పు తండాలలో జనవరి 2న మద్దిరాల, ముకుందాపురం, 3న చందుపట్ల, చిన్ననెమిలలో, 4న కుక్కడం, గుమ్మడవెల్లి గ్రామాల్లో సభలు నిర్వహించనున్నట్లు ఈ సభల్లో ప్రభుత్వం 5గ్యారంటీలపై లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. ఆయన వెంట అధికారులు ఉన్నారు.

ఆత్మకూర్ (ఎస్) : మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రజా పాలనపై గ్రామసభలు నిర్వహించనున్నట్లు మండల ప్రత్యేకాధికారులు నాగేంద్రశర్మ, వెంకటరెడ్డి తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు, మండల అధికారులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మల్సూర్‌నాయక్, డిప్యూటీ తహసీల్దార్ పుష్ప, ఎంపీఓ సంజీవ, వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

అర్వపల్లి : మండల పరిధిలోని కాసర్లపహాడ్, నాణ్యతండా, వేల్పుచర్ల, అర్వపల్లి గ్రామాల్లో ప్రజాపాలన గ్రామసభల ఏర్పాట్లను బుధవారం డీపీఓ, మండల ప్రత్యేక అధికారి రామారావు నాయక్ పరిశీలించారు. ఈ గ్రామసభల్లో గురువారం నుంచి జనవరి 6వరకు ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నారు. గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు అందుబాటులో ఉంటారని వారికి దరఖాస్తులు అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ ఆర్.శశిధర్‌రెడ్డి, నాయబ్ తహసీల్దార్ కంట్లమయ్య, ఎంపీఓ సందీప్‌కుమార్, కార్యదర్శులు మాగి నాగయ్య, శ్రీనివాసరాజు, కావ్య, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

పెన్‌పహాడ్ : ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా మండలంలోని అన్ని గ్రామాల్లో నిర్వహించే గ్రామ సభల ఏర్పాట్లను మండల ప్రత్యేక అధికారులు రాంపతి, రమేష్ బుధవారం పరిశీలించారు. మండల పరిధిలోని గూడెపుకుంట, జల్మాలకుంట, చినగారకుంట, చిన సీతారాంతండా గ్రామాల్లో వారు ఏర్పాట్లను పరిశీలించి మాట్లాడారు. వారి వెంట ఎంపీడీఓ బాణాల శ్రీనివాస్, ఏఓ కృష్ణసందీప్, ఆర్ఐ మట్టయ్య, ఏపీఓ రవి, ఏపీఎం అజయ్‌నాయక్ తదితరులు ఉన్నారు.

నాగారం : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ జి.శోభారాణి కోరారు. బుధవారం మండల కేంద్రంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. గ్రామాల్లో నేటి (గురువారం) నుంచి జనవరి 6వతేదీ వరకు 8రోజుల పాటు ప్రజా పాలన గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 28న (నేడు) మాచిరెడ్డిపల్లి, పేరబోయినగూడెం, శాంతినగర్, లక్ష్మాపురం, 29న ఈటూరు, నాగారం, 30న ఫణిగిరి, వర్ధమానుకోట, 2న నాగారంబంగ్లా, మామిడిపల్లి, డి.కొత్తపల్లి, 3న పసునూర్, పస్తాల, 4న నర్సింహులగూడెం గ్రామాల్లో గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ గ్రామసభలకు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మండల, గ్రామస్థాయి అధికారులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

నేటి నుంచి ప్రజా పాలన దరఖాస్తుల స్వీకరణ

తుంగతుర్తి : నేటి నుంచి మండలంలోని వివిధ గ్రామపంచాయతీల్లో నిర్వహించే ప్రజా పాలన కార్యక్రమంలో కాంగ్రెస్ గ్యారంటీ పథకాలకు సంబంధించి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ఎంపీడీఓ భీంసింగ్ బుధవారం విలేకరులకు తెలిపారు.

ప్రజా పాలనను సద్వినియోగం చేసుకోవాలి

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని యువజన కాంగ్రెస్ సోషల్ మీడియా స్టేట్ కోఆర్డినేటర్ కొండ రాజు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీ పథకాలకు ప్రజలకు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఆయన వెంట యూత్ కాంగ్రెస్ నాయకులు మాచర్ల అనిల్, నరేష్, అబ్దుల్, వెంకన్న, హుస్సేన్, సంతోష్, సిద్దిక్, ఉమీర్ ఉన్నారు.

చివ్వెంల : ప్రజాపాలన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ రంగారావు తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 28నుంచి జనవరి 6వరకు నిర్వహించే గ్రామసభల్లో అర్హులైన ప్రతిఒక్కరూ ప్రభుత్వ అందించే పథకాలకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రతి రోజు రెండు విడతలుగా గ్రామసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆయన వెంట ఎంపీడీఓ ఎల్.లక్ష్మి, ఎంపీఓ టి.గోపి తదితరులు ఉన్నారు.

నూతనకల్ : గ్రామాల్లో నేటి నుంచి నిర్వహించే ప్రజాపాలన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీఓ ఇందిర కోరారు. బుధవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. గ్రామసభలు నేడు బిక్కుమళ్ల, దిర్శనపల్లి, సోమ్లాతండా, బక్కహేమ్లాతండా, 29న అల్లునూరు, టీక్యాతండా, తాళ్లసింగారం, మాచనపల్లి, 30న పెదనెమిల, కొత్తతండా, వెంకెపల్లి, యడవెల్లి, 2న లింగంపల్లి, చిల్పకుంట్ల, 3న మిర్యాల, ఎర్రపహాడ్, 4న నూతనకల్ గ్రామాల్లో నిర్వహించే సభల్లో దరఖాస్తులు చేసుకోవాలని కోరారు.



అర్వపల్లి : గ్రామసభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ప్రత్యేక అధికారి రామారావునాయక్ తదితరులు



పెన్‌పహాడ్ : గ్రామసభ ఏర్పాట్లపై సూచనలు చేస్తున్న అధికారులు



సూర్యాపేట రూరల్ : ఆరెగూడెంలో గ్రామసభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు



ఆత్మకూర్(ఎస్) : అవగాహన సదస్సులో మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి

ఎస్సారెస్పీ నీటిని విడుదల చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న పులుసు సత్యం

నాగారం : రాష్ట్ర ప్రభుత్వం ఎస్సారెస్పీ నీటిని విడుదల చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు పులుసు సత్యం డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన పార్టీ మండల కమిటీ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఇప్పటికే రైతులు యాసంగి పనులు ప్రారంభించి నార్లు పోసుకొని నాట్లు వేసుకునేందుకు సన్నద్ధమవుతున్నారని, నేటికి ప్రభుత్వం ఎస్సారెస్పీ నీటిని విడుదల చేయకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రభుత్వం ప్రజాపాలన పేరుతో నిర్వహించే గ్రామ సభల్లో సీపీఎం కార్యకర్తలు పాల్గొని ప్రజల చేత దరఖాస్తు చేయించాలని సూచించారు. గత పదేళ్లుగా రేషన్ కార్డులు, డబుల్‌బెడ్‌రూం ఇల్లు, ఇళ్ల స్థలాలు, పెన్షన్లు రాక తీవ్ర ఇబ్బందులు పడ్డారని, నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయాలని కోరారు. సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి కడియం కుమార్, కేవీపీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి దేవరకొండ యాదగిరి, సీఐటీయూ మండల కన్వీనర్ గూడపూరి వెంకటేశ్వర్లు, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి కండె భిక్షం, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

అయోధ్య రామాలయ అక్షింతలకు ప్రత్యేక పూజలు



ఆత్మకూర్ (ఎస్) : నెమ్మికల్లులోని రామాలయంలో అక్షింతలతో గ్రామస్తులు

ఆత్మకూర్ (ఎస్) : అయోధ్యలోని రామాలయం నుంచి వచ్చిన అక్షింతలు మండలానికి చేరుకున్నాయి. బుధవారం మండలంలోని నెమ్మికల్‌లో గల రామాలయంలో అక్షింతలను ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మండలంలోని అన్ని గ్రామాల నుంచి వచ్చిన భక్తులకు వాటిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రామ మందిర తీర్థ ట్రస్ట్ సభ్యుడు మధు మాట్లాడుతూ.. జనవరి 1నుంచి 15వరకు గ్రామంలోని ప్రతి కుటుంబానికి అక్షింతలు అందజేయాలన్నారు. కార్యక్రమంలో రామాలయ తీర్థ క్షేత్ర ట్రస్ట్ సభ్యులు పరిపూర్ణాచారి, సుందర్, వెంకటేష్, భక్తులు పాల్గొన్నారు.

కోదూరుకు చేరిన అక్షింతలు

అర్వపల్లి : అయోధ్య రామమందిరం నుంచి వచ్చిన రాముడి అక్షింతలను జాజిరెడ్డిగూడెంలోని శ్రీయోగానందలక్ష్మీనర్సింహస్వామి దేవాలయం నుంచి ఊరేగింపుగా బుధవారం మండలంలోని కోడూరులో గల శ్రీ సీతారామాంజనేయస్వామి దేవాలయానికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా అక్కడి ఆలయంలో అక్షింతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకుడు, ట్రాన్స్‌కో రిటైర్డ్ అధికారి చెంచెల సోమనాథం, అర్చకుడు తాదూరి విశ్వనాథచారి, చెంచెల లక్ష్మయ్య, దాసరి సోమయ్య, బింగి కృష్ణమూర్తి, తాటిపాముల జలేందర్, శిగ రవి, దామోదరచారి, నాగలక్ష్మి పాల్గొన్నారు.



అర్వపల్లి : కోదూరు ఆలయంలో అక్షింతలకు పూజలు చేస్తున్న భక్తులు

యువత చెడువ్యసనాలకు దూరంగా ఉండాలి



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏఎస్‌ఐ రాములు

చివ్వెంల : యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఏఎస్‌ఐ రాములు అన్నారు. బుధవారం మండల పరిధిలోని దురాజ్‌పల్లి గ్రామ శివారులో గల ప్రతిష్ట ఫార్మసీ కళాశాలలో గంజాయి, డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అదే విధంగా మహిళల భద్రత కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, సెల్‌ఫోన్‌లో ఓటీపీలను గుర్తు తెలియని వ్యక్తులకు చెప్పవద్దన్నారు. మహిళలు, బాలికల రక్షణ కోసం ప్రత్యేకంగా షీటీమ్స్ ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా పోలీస్ కళాబృందం సభ్యులు యువత చెడు వ్యసనాల వల్ల కలిగే అనర్థాలపై ఆట పాటలతో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిబ్బంది శ్రీనివాస్, సాయిశంకర్, వెంకట్ రెడ్డి, ప్రిన్సిపల్ రాజ్‌కుమార్, ఉపాధ్యాయులు, కళాబృందం సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కనులపండువగా అయ్యప్ప మండల పూజ



మండల పూజలో పాల్గొన్న భక్తులు

భానుపురి (సూర్యాపేట) : పట్టణంలోని శబరినగర్‌లో గల శ్రీధర్మశాస్త్ర అన్నదాన సేవా సమితి ప్రాంగణంలో అయ్యప్ప స్వామి మండల పూజ మహోత్సవాన్ని బుధవారం కనులపండువగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ సుందరి కిరణ్‌కుమార్, శ్రీధర్మశాస్త్ర అన్నదాన సేవాసమితి అధ్యక్షుడు యర్రంశెట్టి ఉపేందర్, చిత్తలూరి కోటేశ్వరరావు దంపతులు అయ్యప్పస్వామికి పంచామృత అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మాలధారణ స్వాములకు అన్నదాన వితరణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అయ్యప్ప కరుణ కటాక్షాలు అందరికీ దండిగా ఉండాలని, నిత్యం ఆనందంగా ఆయురారోగ్యాలతో ఉండాలన్నారు. కార్యక్రమంలో శ్రీధర్మశాస్త్ర అన్నదాన సేవా సమితి నిర్వాహకులు వెంపటి పురుషోత్తం, అంతటి విజయ్, గురుస్వామి రాచకొండ దేవయ్య, రాచకొండ కృష్ణ, చీకూరి కృష్ణ, పిట్టల ఉపేందర్, శ్రీనాథ్, పాకల విక్రమ్ మాలధారులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలను పెంపొందించాలి



పాఠశాలలో ఎఫ్‌ఎల్‌ఎన్ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ బాలునాయక్

నాగారం : ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలను పెంపొందించాలని మండల విద్యాధికారి బి.బాలునాయక్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యాశాఖ చేపట్టిన తొలిమెట్టు (ఎఫ్‌ఎల్‌ఎన్) కార్యక్రమంలో భాగంగా తరగతి బోధనను పరిశీలించి మాట్లాడారు. వర్క్‌బుక్స్ విద్యార్థుల చేత చేయిస్తే విద్యార్థుల్లో సామర్థ్యాలు పెరిగి వారి అభ్యసనానికి దోహదపడుతుందన్నారు. ప్రతి విద్యార్థి తెలుగు, ఆంగ్లభాషా, గణిత సామర్థ్యాలను సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. అనంతరం అన్ని తరగతుల వర్క్‌షీట్స్, ఫార్మేటీవ్ అసెస్మెంట్, సమ్మేటీవ్, ఎఫ్‌ఎల్‌ఎన్ పరీక్ష పత్రాలను పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వర్దెల్లి మల్లయ్య, ఉపాధ్యాయులు బి.వెంకటమల్లు, వీరేష్, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మారెడ్డి మృతి పార్టీకి తీరనిలోటు

ఆత్మకూర్ (ఎస్) : సీపీఎం సీనియర్ నాయకుడు కోతి లక్ష్మారెడ్డి (65) మృతి పార్టీకి తీరనిలోటని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి అన్నారు. మండలంలోని నెమ్మికల్ గ్రామానికి చెందిన లక్ష్మారెడ్డి బుధవారం మృతి చెందడంతో ఆయన మృతదేహంపై ఎర్రజెండా కప్పి నివాళులర్పించారు. ఆయన వెంట పార్టీ జిల్లా కమిటీ సభ్యులు దండా వెంకటరెడ్డి, వేల్పుల వెంకన్న, మండల కార్యదర్శి అవిరె అప్పయ్య, శాఖ కార్యదర్శి బెల్లంకొండ చక్రయ్య, గంపల ఎల్లయ్య, గోలి భాగ్యమ్మ, మూల విజయరెడ్డి తదితరులు ఉన్నారు.



నివాళులర్పిస్తున్న మల్లు నాగార్జునరెడ్డి తదితరులు

ఆలయ అభివృద్ధికి విరాళాల అందజేత



ఆలయ అర్చకుడికి విరాళాలు అందజేస్తున్న దాతలు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెంలోని శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో దాతల సహకారంతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారు. ఆలయంలో దాతల సహకారంతో సుమారు రూ.30లక్షలతో రాజగోపురం, కల్యాణ మండపం, రేకుల షెడ్ నిర్మిస్తుండటంతో పలువురు దాతలు తమవంతు సహకారం అందిస్తున్నారు. అందులో భాగంగా కీర్తి వెంకటేశ్వర్లు రూ.30,116, మాధవి మొబైల్స్ యజమాని బొల్లం సైదులు రూ.5,116, సామంతపురి మురళి రూ.5వేలు, సామంతపురి మధు రూ.5వేలు, గోవిందం నర్సింహస్వామి రూ.5,116, బొబ్బలి అవిలయ్య రూ.6,116, గద్దగూటి నర్సయ్య రూ.5,116, నర్సింగ పెద్దలింగయ్య రూ.5,016, బత్తుల వెంకటేశ్వర్లు రూ.5,116 చొప్పున బుధవారం విరాళాలు అందజేశారు. కార్యక్రమంలో అర్చకులు రాంబాబుఅయ్యంగార్, పవన్ కుమార్, భక్తమండలి సభ్యులు పాల్గొన్నారు.

‘ప్రజావాణి’ని సద్వినియోగం చేసుకోవాలి

తుంగతుర్తి : మండలంలోని విద్యుత్ వినియోగదారులు ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని విద్యుత్ ఏఈఈ శ్రీనివాస్ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తుంగతుర్తి మండల వినియోగదారులు మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్‌లో, అదే విధంగా మద్దిరాల, నూతనకల్ మండలాల వినియోగదారులు నూతనకల్‌లోని సబ్‌స్టేషన్‌లో తమ విద్యుత్ సమస్యలు పరిష్కరించుకోవాలని కోరారు. ఈ ప్రజావాణి కార్యక్రమం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు నిర్వహించనున్నట్లు, ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఎస్ఈఈ పాల్‌రాజ్, డీఈఈ శ్రీనివాసులు హాజరవుతారని తెలిపారు.

బీఎస్పీ నల్లగొండ పార్లమెంట్ ఇన్‌చార్జ్‌గా మల్లేష్



బుడిగె మల్లేష్‌యాదవ్

అర్వపల్లి : బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) నల్లగొండ పార్లమెంట్ ఇన్‌చార్జ్‌గా జాజిరెడ్డిగూడెం మండలంలోని తిమ్మాపురం గ్రామానికి చెందిన బుడిగె మల్లేష్‌యాదవ్ నియమితులయ్యారు. ఈ మేరకు బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ మల్లేష్‌యాదవ్‌ను నియమిస్తున్నట్లు బుధవారం ప్రకటించారు. ఇప్పటికే మల్లేష్ బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శిగా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మా ట్లాడారు. తనను నియమించిన ప్రవీణ్ కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతంతో పాటు నల్లగొండ ఎంపీ స్థానాన్ని కైవసం చేసుకునేలా కృషి చేస్తానన్నారు.

మాల మహానాడు మండల కమిటీ ఎన్నిక



ఎన్నికైన కమిటీ సభ్యులు

తిరుమలగిరి (తుంగతుర్తి) : మండల కేంద్రంలో మాల మహానాడు మండల నూతన కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా లక్ష్మణ్, ఉపాధ్యక్షుడిగా సందీప్, కార్యదర్శిగా పెరమాండ్ల వరుణ్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ప్రభుదాస్, లారెన్స్, దిలీప్, మల్లేష్, యాకూబ్, సుధాకర్, సుమంత్, సాల్మన్ తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడిగా జాఫర్



జాఫర్‌కు నియామకపత్రం అందజేస్తున్న రాంరెడ్డి దామోదర్‌రెడ్డి

చివ్వెంల : మండల కేంద్రానికి చెందిన ఎండీ జాఫర్ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడిగా నియమితులయ్యారు. బుధవారం పట్టణంలో నిర్వహించిన పార్టీ జిల్లా కమిటీ సమావేశంలో ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి ఆయనకు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జాఫర్ మాట్లాడారు. తన ఎంపికకు సహకరించిన మండల, జిల్లా నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మండల, జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రాయితీని సద్వినియోగం చేసుకోవాలి

అర్వపల్లి : వాహనాలపై ఉన్న పెండింగ్ చలాన్లపై ప్రభుత్వం ఇస్తున్న రాయితీని వాహనదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఐ బి.అంజిరెడ్డి కోరారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఆర్టీసీ బస్సులు, తోపుడు బండ్లపై 90శాతం, ద్విచక్ర వాహనాలపై 80శాతం, ఆటోలు, నాలుగు చక్రాల వాహనాలపై 60శాతం, భారీ వాహనాలపై 50శాతం రాయితీ కల్పిస్తున్నట్లు తెలిపారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిక

మద్దిరాల : మండల పరిధిలోని మామిండ్లమడవ గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ పార్టీ 7వ వార్డు సభ్యుడు ధరావత్ రమేష్ కాంగ్రెస్‌లో చేరారు. బుధవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు నూకల జగన్‌రెడ్డి ఆయనకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో గ్రామశాఖ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, అంగోత్ భిక్షం, నెహ్రూ, కిషన్, రవి, కాశీం, దస్రు నాయకులు తదితరులు పాల్గొన్నారు.